సాక్షి
ఖమ్మం
బుధవారం । 25 । జనవరి । 2023



ఓటు.. వజ్రాయుధం!

అభివృద్ధి చేసే వారిని ఎన్నుకోవడం, పనితీరు సరిగ్గా లేని నేతలను తిరస్కరించేలా ప్రజల చేతిలో ఓటు వజ్రాయుధంగా నిలుస్తోంది. 8లో



విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవడితే లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చని జిల్లా జడ్జి శ్రీనివాసరావు వెల్లడించారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 17°

వాతావరణం

బుధవారం ఉదయం మంచు, సాయంత్రం తర్వాత చలిగాలుల ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరిగే అవకాశముంది.

అస్త్రశస్త్రాలు రెడీ !



జిల్లాలో ముందస్తు ఎన్నికల వేడి

- పోరుకు సై అంటున్న నేతలు, ఆశావహులు
- టికెట్లే లక్ష్యంగా పోటాపోటీ కార్యక్రమాలు
- విమర్శలు, ప్రతివిమర్శలతో వేడెక్కుతున్న వాతావరణం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ముందస్తు ఎన్నికలు వస్తాయన్న ప్రచారం నేపథ్యాన ఉమ్మడి జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఆశావహులు జోరు పెంచారు. నియోజకవర్గాల్లో పోటాపోటీగా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతోపాటు అనుచరులతో సమావేశమవుతూ భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు చేస్తున్నారు. భారీ సభ నిర్వహించడం ద్వారా బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లాలో రాజకీయ వేడిని రగల్చగా... కమ్యూనిస్టులు కూడా నిత్యం ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇక కాంగ్రెస్ ఆధ్వర్యాన ఈనెల 26 నుంచి హాథ్ సే హాథ్ జోడో' పేరుతో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క యాత్ర చేపట్టాలని నిర్ణయించారు. ఇంకోపక్క బీజేపీ కూడా అదే బాటలో పయనిస్తోంది. అలాగే, టికెట్లు ఆశిస్తున్న పార్టీల్లోని నేతలు కదనరంగంలోకి దూకుతూ... నిత్యం ప్రజల్లో ఉండేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నారు.

కొత్త సంవత్సరంలో మారిన ముఖచిత్రం

కొత్త సంవత్సరం మొదలైన రోజు నుంచే ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ముందస్తు ఎన్నికలు వస్తాయనే ఊహాగానాలతో నేతలు ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలో నేతలు చేసిన వాడీవేడి ప్రసంగాలు రాజకీయ కాక పెంచాయి. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా పోటీ చేయాలనే ఉద్దేశంతో ఉన్న నేతలు దూకుడుగా వ్యవహరిస్తున్నారు. అవసరమైతే తమ దారి తాము చూసుకుంటామనే సంకేతాలను ఇచ్చేశారు. ఇదే సమయాన ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యాన బీఆర్ఎస్ తొలి సభను ఖమ్మంలో నిర్వహించనున్నట్లు ప్రకటించడం... ఈ సభకు మరో ముగ్గురు ముఖ్యమంత్రులు హాజరుకావడంతో ఈనెల మొదటి పక్షమంతా అదే హడావుడి కనిపించింది.

వాడ వాడకు పువ్వాడతో..

ఈనెల 1వ తేదీ నుంచి రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ 'వాడవాడకు పువ్వాడ' కార్యక్రమం ప్రారంభించారు. వారంలో ఒకటి, రెండు రోజులు ఖమ్మంలోని డివిజన్లలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వారితో మమేకమయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను వివరించడమే కాక తన హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తున్నారు. అదే సమయాన పలు అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపన చేస్తున్నారు.

పొంగులేటి 'ఆత్మీయ' బాట..

ఇక మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వరం మరింత పెంచారు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో సంచలనం రేపగా... పినపాక, ఇల్లెందు నియోజకవర్గాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి పార్టీపై అసంతృప్తిని బాహాటంగానే వెలిబుచ్చారు. మిగతా నియోజకవర్గాల్లోనూ ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఈక్రమంలో ఆయన పార్టీ మారడం ఖాయమనే ప్రచారం జరుగుతుండగా.. ఏ పార్టీలోకి వెళ్తారనేది రాజకీయంగా ఉత్కంఠ కలిగిస్తోంది.

కాంగ్రెస్‌లో కదలిక..

ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీ కూడా జోరు పెంచేలా కార్యక్రమాలను రూపొందిస్తోంది. ఈనెల 26 నుంచి 'హాథ్ సే హాథ్ జోడో' పేరుతో యాత్ర చేపట్టేందుకు యత్నాలు జరుగుతున్నాయి. ఈయాత్రను ఉమ్మడి జిల్లాకు చెందిన సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపడతారనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తన పాదయాత్ర భద్రాచలం నుంచి ప్రారంభిస్తారనే ఊహాగానాలు సాగుతున్నాయి. ఇలా ప్రతీ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ నేతలు కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఇతర పార్టీల్లోనూ జోష్

ఈ పార్టీలతోపాటు బీజేపీ, కమ్యూనిస్టుల్లోనూ ఎన్నికల జోష్ కనిపిస్తోంది. సీపీఐ, సీపీఎం వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో జత కట్టే సూచనలు కనిపిస్తుండగా.. ఉమ్మడి జిల్లాకే చెందిన ఇరు పార్టీల రాష్ట్ర కార్యదర్శులు విస్తృత పర్యటనలు చేస్తున్నారు. బీఆర్ఎస్ తొలి ఆవిర్భావ సభలోనూ సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజాతోపాటు వీరిద్దరు పాల్గొన్నారు. మరోవైపు బీజేపీ జిల్లాలో పట్టు సాధించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. వచ్చే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను పోటీ చేయించి అత్యధిక సీట్లు సాధించాలనే లక్ష్యంతో పార్టీ అధిష్టానం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించింది.

పోటాపోటీగా..

ఉమ్మడి జిల్లాలోని సిట్టింగ్ ఎమ్మెల్యేలతోపాటు ఆశావహులు కూడా ప్రజామద్దతు కూడగట్టుకునేందుకు శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ ఆత్మీయ సమావేశం నిర్వహించి.. రాజకీయ ప్రత్యర్థులపై విరుచుకుపడ్డారు. అలాగే పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కార్యకర్తలతో భేటీ అవుతూనే పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలతో మమేకమవుతున్నారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా తన అనుచరులతో సమావేశమయ్యారు. మరికొందరు నేతలు సైతం రానున్న ఎన్నికలే లక్ష్యంగా కార్యకర్తలతో భేటీ అవుతుండడంతో ప్రజల్లో ఉండేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

ప్రారంభమైన జేఈఈ మెయిన్స్



పరీక్ష కేంద్రం వద్ద క్యూలో నిల్చున్న విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: జేఈఈ మెయిన్స్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో మూడు కేంద్రాలు ఏర్పాటుచేయగా, ఉదయం పరీక్షకు 453మంది అభ్యర్థులకు గాను 448మంది హాజరయ్యారు. ఇక మధ్యాహ్నం పరీక్షకు 451మందిలో 449మంది హాజరయ్యారు. పరీక్షలు తొలిరోజు సాఫీగా సాగాయని సిటీ కోఆర్డినేటర్ పార్వతిరెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా విద్యార్థుల హాల్ టికెట్ లోనే పరీక్షా కేంద్రానికి రావాల్సిన సమయాన్ని పేర్కొనడంతో ఎక్కడా గుంపులు కనిపించలేదు. విద్యార్థులు కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా మాస్క్ ధరించి రాగా, శానిటైజర్లు వేశాక అనుమతించారు.

నూతన కలెక్టరేట్‌లోనే గణతంత్రం

ఖమ్మం సహకారనగర్: నూతన కలెక్టరేట్ల(సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం)లోనే గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించగా, సీఎస్ శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మంగళవారం ఏర్పాట్లను అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, ఏసీపీ ప్రసన్నకుమార్, డీఆర్వో శిరీష పరిశీలించారు. ఐడీఓసీలో జాతీయ పతాకం ఆవిష్కరణ, వేదిక, స్టాళ్ల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ మదన్‌గోపాల్, రఘునాథపాలెం తహసీల్దార్ నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు. ఇంతకాలం గణతంత్ర దినోత్సవ వేడుకలను పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించగా... కొత్త కలెక్టరేట్‌కు దాదాపు అన్ని శాఖలు రావడంతో ఇక్కడే వేడుకలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ప్రజలకు అందుబాటులో పార్కులు



గోళ్లపాడు చానల్‌పై పనులను పరిశీలిస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన కలెక్టర్ గౌతమ్ తదితరులు

- గోళ్లపాడు చానల్‌ను అందంగా తీర్చిదిద్దుతున్నాం
- త్వరలోనే మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: నగరాభివృద్ధిలో భాగంగా గోళ్లపాడు చానల్‌ను ఆధునికీకరిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండేలా పార్కులను తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. గోళ్లపాడు చానల్, తదితర పనులను కలెక్టర్ వీ.పీ.గౌతమ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి మంగళవారం మంత్రి పరిశీలించారు. 29వ డివిజన్ ప్రకాశ్‌నగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్, 34వ డివిజన్ పంపింగ్ వెల్ రోడ్డులోని కాళోజీ నారాయణరావు, మంచికంటి రామకిషన్‌రావు, కొండా లక్ష్మణ్ బాపూజీ పార్కులను వారు పరిశీలించగా మంత్రి మాట్లాడారు. దుర్గంధం, దోమలు, అపరిశుభ్ర వాతావరణంలో త్రీ టౌన్ వాసులు నివసించే వారని... 2016లో కేసీఆర్ పర్యటనను సందర్భంగా విడుదల చేసిన రూ.100కోట్లతో గోళ్లపాడు చానల్ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ప్రజలకు ఆహ్లాదం పంచడానికి పార్కులు, ఓపెన్ జిమ్, క్రీడాప్రాంగణాలు అందుబాటులోకి వస్తున్నాయని.. రాష్ట్ర మంత్రి కేటీఆర్ వీటిని త్వరలోనే ప్రారంభిస్తారని మంత్రి చెప్పారు.



లబ్ధిదారులకు భోజనం వడ్డిస్తున్న మంత్రి

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

యువతుల వివాహానికి ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వరంలా మారాయని, రూపాయి అప్పు చేయకుండా ఆడపిల్ల పెళ్లి చేసేందుకు సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని 92 మంది లబ్ధిదారులకు రూ.92 లక్షల విలువైన చెక్కులను క్యాంపు కార్యాలయంలో మంత్రి అందజేసి లబ్ధిదారులు, వారి కుటుంబీకులతో కలిసి భోజనం చేశారు. ఈకార్యక్రమాల్లో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా, మార్కెట్ చైర్మన్లు విజయ్, లక్ష్మీప్రసన్న, బీఆర్ఎస్ నాయకుడు ఆర్‌జేసీ.కృష్ణతో పాటు ఈఈలు రంజిత్, కృష్ణలాల్, తహసీల్దార్ శైలజ, ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

- ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటేనే ఫలితం
- టాస్క్‌ఫోర్స్ సమావేశంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ స్నేహలత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో అగ్ని ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్(ఐడీఓసీ)లో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భవనాల్లో భద్రతా చర్యలు, అగ్నిమాపక చర్యలు చేపట్టేలా పర్యవేక్షించాలని సూచించారు. ఐదు అంతస్తులకు మించి నిర్మాణం ఉంటే ఫైర్ అనుమతి తీసుకునేలా చూడాలన్నారు. టౌన్ ప్లానింగ్, పోలీస్ శాఖలు సంయుక్త తనిఖీలు చేపట్టాలని సూచించారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ నగరంలోని ఏడు సినిమా హాళ్లు, 16 పాఠశాలలు, కళాశాలలు, 15 ఫంక్షన్ హాళ్లు, 21 మాల్స్‌ను గుర్తించి అగ్నిమాపక నిబంధనలు పాటించేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

గడువులోగా అనుమతి ఇవ్వాలి

లేఔట్ల అనుమతులను గడువులోగా ఇవ్వాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. జిల్లా స్థాయి లేఔట్ అప్రూవల్ కమిటీ సమావేశంలో కేఎంసీ, సుడా పరిధిలో అందిన 15 దరఖాస్తులను పరిశీలించి ఆరింటికి ఆమోదం తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి 21 రోజుల్లోగా అనుమతులను జారీ చేయాలన్నారు. ఆతర్వాత జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమోదించవచ్చని తెలిపారు.

భద్రతా చర్యలు తీసుకోండి

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(నూతన కలెక్టరేట్)లోని ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్, రికార్డు గదులను కలెక్టర్ గౌతమ్ మంగళవారం పరిశీలించారు. అలాగే, మరికొన్ని విభాగాలను పరిశీలించిన ఆయన భద్రతా చర్యలపై సూచనలు చేశారు. కాగా, నూతన కలెక్టరేట్‌లో ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు హాఫీజ్ అబీబుద్దీన్, సయ్యద్ మొహినుద్దీన్ అలీ, క్రైస్తవ మతపెద్దలు లాజరస్, రాజు కలెక్టర్ చాంబర్‌లో ప్రార్థనలు చేశారు.

పచ్చదనం వెల్లివిరియాలి

రఘునాథపాలెం: పచ్చదనం వెల్లివిరిసేలా కలెక్టరేట్ సముదాయంలోని ప్రకృతి వనాన్ని తీర్చిదిద్దాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. ప్రకృతివనంలో కలెక్టర్, అధికారులు మొక్కలు నాటగా ఆయన మాట్లాడారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్ స్నేహలత, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, జిల్లా అగ్నిమాపక అధికారి జయప్రకాష్, జలవనరుల శా ఖ సీఈ శంకర్‌నాయక్, ఆర్డీఓ రవీంద్రనాథ్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మనకూ... అమృత్ భారత్!

- ఉమ్మడి జిల్లాలోని పలు స్టేషన్లకు స్థానం
- జాబితాలో భద్రాచలం రోడ్డు, ఖమ్మం, మధిర రైల్వేస్టేషన్లు
- ప్లాట్‌ఫామ్ మొదలు వెయిటింగ్ హాళ్ల వరకు అభివృద్ధి
- ఆధునిక సౌకర్యాల కల్పనకు సిద్ధమవుతున్న ప్రణాళిక

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్లలో సౌకర్యాలు కల్పిస్తూ ఆధునికీకరించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకోసం అమృత్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టగా దశల వారీగా స్టేషన్లను ఎంపిక చేసి పనులు నిర్వహిస్తున్నారు. తాజాగా సికింద్రాబాద్ డివిజన్‌లో ఇరవై స్టేషన్లను ఎంపిక చేయగా, ఇందులో ఉమ్మడి జిల్లాలోని మూడు స్టేషన్లకు స్థానం లభించింది. ఈ పథకంద్వారా మూడు స్టేషన్లలో డ్రెయినేజీలు మొదలు మొదలు వై - ఫై వరకు అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధమవుతోంది.

ప్లాట్‌ఫామ్స్

అమృత్ భారత్ పథకంలో ఎంపికైన స్టేషన్లలో ప్లాట్‌ఫారాలను ఆధునికీకరిస్తారు. ప్రస్తుతం ఈ స్టేషన్లలో ప్లాట్‌ఫామ్స్ ఎత్తు 76 సెం.మీ. ఉండగా దాన్ని 84 సెం.మీ.కు పెంచుతారు. ఫలితంగా రైలు ఎక్కడం, దిగడం మరింత సులువవుతుంది. గ్రాండ్ ట్రంక్ మార్గంలో ఉన్న ఖమ్మం, మధిర స్టేషన్లలో ప్లాట్‌ఫామ్స్ 24 బోగీల రైలు ఆగేందుకు అనువుగా సుమారు 600 మీటర్ల పొడవుతో ఉన్నాయి. ఎక్కడైనా ప్లాట్‌ఫామ్ పొడవు తక్కువగా ఉంటే వాటిని పెంచనున్నారు. ఇక కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో 18 నుంచి 21 బోగీలు రైలు నిలిపేందుకు అనువుగానే ప్లాట్‌ఫామ్స్ ఉండగా, 24 బోగీల రైలు నిలిపేందుకు వీలుగా తీర్చిదిద్దుతారు.

వెయిటింగ్ హాళ్లు

ఖమ్మం, మధిర, భద్రాచలంరోడ్డు స్టేషన్లలో సాధారణ ప్రయాణికులు, రిజర్వ్‌డ్, ఉన్నత శ్రేణి(ఏసీ) ప్రయాణికులకు వెయిటింగ్ హాళ్లు ఉన్నాయి. అయితే స్టేషన్‌లో స్థల లభ్యత ఆధారంగా అక్కడక్కడా ఉన్నాయి. అమృత్ భారత్‌లో భాగంగా అన్ని వెయిటింగ్ హాళ్లను ఒకే దగ్గర ఉండేలా నిర్మాణం చేపడుతారు. వీటికి దగ్గర్లోనే కేఫ్‌టేరియా ఉండేలా కొత్తగా స్టేషన్ డిజైన్ చేస్తారు. అంతేకాక టీసీల ప్రత్యేక వెయింగ్ హాల్ నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి.

ఫర్నిచర్ కూడా...

ప్రస్తుతం ప్లాట్‌ఫామ్స్, వెయిటింగ్ హాళ్లలో ఉన్న ఫర్నిచర్‌ను నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా మారుస్తారు. ప్రయాణికులు ఎదురుచూసే, కూర్చునే స్థలాల్లో మొబైల్ ఫోన్ల చార్జింగ్‌కు అనువుగా సాకెట్లు, హోల్డర్లు ఏర్పాటు చేస్తారు. అలాగే, రద్దీ ఆధారంగా మొబైల్ చార్జింగ్ ఏరియాను అందుబాటులోకి తెస్తారు. అవసరమైన చోట ప్రస్తుతం ఉన్న సిమెంట్ బెంచీలు, ఇనుప కుర్చీలకు బదులు కంఫర్టబుల్ మల్టీ యుటిలిటీ ఫర్నిచర్ ఏర్పాటు చేస్తారు.

పార్కింగ్.. ఇతర సౌకర్యాలు

ఎంపిక చేసిన స్టేషన్లలో పార్కింగ్ ఏరియాను కూడా పూర్తిగా ఆధునికీకరించి.. బస్ బే, ఆటో బేలను ఏర్పాటు చేస్తారు. స్టేషన్ ఆవరణలోని రావడం / వెళ్లే మార్గాలను సూచిస్తూ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తారు. స్టేషన్ ఆవరణలో లైటింగ్ వ్యవస్థ, గ్రీనరీని కూడా కొత్తగా డిజైన్ చేస్తారు. వీటితో పాటు అవసరమైన చోట రోడ్ల వెడల్పు, పాదచారులు నడిచేదారులు నిర్మిస్తారు. అంతేకాక స్టేషన్‌లో నిరుపయోగంగా ఉన్న కట్టడాలను తొలగించడంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థలో మార్పులు చేపడతారు. అలాగే, ఫ్లాట్‌ఫాంల సంఖ్యకు అనుగుణంగా ఎస్కలేటర్లు, తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు, డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు, టీవీలు ఏర్పాటు చేయబోతున్నారు. ఇంకా దివ్యాంగులకు సౌకర్యవంతంగా ఉండేలా రాకపోకల మార్గం, నిర్మాణం జరగనుంది.

మూడు స్టేషన్ల ఎంపిక

బ్రిటీష్ కాలంలో నిర్మించిన రైల్వేస్టేషన్లను గడిచిన రెండు దశాబ్దాలుగా రైల్వే అభివృద్ధి చేస్తోంది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ప్రస్తుత ప్రయాణికుల అవసరాలు, అభిరుచులు దృష్టిలో ఉంచుకుని స్టేషన్లను పూర్తిగా ఆధునికీకరించాలని నిర్ణయించింది. దీని కోసం అమృత్ భారత్ పేరుతో కొత్త పథకాన్ని అమలు చేస్తూ, తొలి విడతలో దేశవ్యాప్తంగా వెయ్యి స్టేషన్లను అభివృద్ధికి సిద్ధమయ్యారు. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం), ఖమ్మం, మధిర రైల్వే స్టేషన్లు ఎంపికయ్యాయి. వీటిలో మధిర, ఖమ్మం స్టేషన్లు ముఖ్యమైన న్యూఢిల్లీ - చెన్నై గ్రాండ్ ట్రంక్ రూట్‌లో ఉండగా భద్రాచలం రోడ్ టెర్మినల్ స్టేషన్‌గా ఉంది.



ఖమ్మం రైల్వేస్టేషన్ ముఖద్వారం

వై - ఫై

ప్రస్తుతం రైల్వేలో ఇంటర్నెట్ ఆధారిత సేవలు గణనీయంగా పెరిగినందున స్టేషన్లలో వై - ఫైకి ప్రాధాన్యత పెరిగింది. ఇప్పటికే కొన్ని స్టేషన్లలో ఉచిత వై-ఫై సేవలు కొనసాగుతున్నా... అమృత్ భారత్‌లో భాగంగా ఎంపిక చేసిన స్టేషన్లలోప్రయాణికులు మెరుగైన 5జీ సేవలందేలా సౌకర్యాలు కల్పిస్తారు.

కమర్షియల్ జోన్లు

అమృత్ భారత్‌లో ఎంపికైన స్టేషన్ల ఆధునికీరణ కోసం ఇప్పటికే మాస్టర్ ప్లాన్లు సిద్ధం చేస్తున్నారు. ఎక్కడైనా భవనాల నిర్మాణం చేపట్టాల్సి వస్తే మొదటి అంతస్తు రైళ్ల రాకపోకలు, ప్రయాణికులు ఉపయోగించుకునేలా... రెండో అంతస్తు, ఆపై నిర్మాణాలను కమర్షియల్ ప్లాజాలుగా ఉపయోగించేలా మాస్టర్ ప్లాన్లు సిద్ధమవుతున్నాయి.

న్యూస్‌రీల్

హెల్ప్ డెస్క్‌తో సహకారం



హెల్ప్ డెస్క్‌లో సమాచారం ఇస్తున్న ఉద్యోగి

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ప్రభుత్వం మెడికల్ కళాశాల పరిధిలోకి తీసుకురాగా, వచ్చే విద్యాసంవత్సరం నుండి బోధన ప్రారంభం కానుంది. ఈనేపథ్యాన ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే వారి సంఖ్య పెరగనుండడంతో ఇబ్బంది పడకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆస్పత్రికి వచ్చే వారికి వివరాలు చెప్పేందుకు గాను తాజాగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. ఆస్పత్రి భవనంలోని ప్రవేశద్వారం వద్ద ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్‌లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు విభాగాల వారీగా వైద్యుల వివరాలతో పాటు రోగుల బంధువులకు అవసరమైన సమాచారం ఇస్తున్నారు. దీంతో చికిత్స పొందడం సులువవుతోందని ఆస్పత్రికి వస్తున్న వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో కేంద్ర బృందం పరిశీలన



సేవలపై ఆరా తీస్తున్న బృందం సభ్యులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిని మంగళవారం జాతీయ ఆరోగ్యమిషన్ కేంద్ర బృందం సందర్శించింది. డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ పర్వీన్ సుల్తానా, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నిలోహణ నేతృత్వాన ప్రభుత్వాస్పత్రిలోని ల్యాబ్‌లు, బ్లడ్‌బ్యాంక్, వీసీటీసీ కేంద్రం, కాన్పుల గది, వార్డులను పరిశీలించారు. బ్లడ్‌బ్యాంక్‌లో కనీసం రక్త నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, సీమాంక్ సెంటర్‌లో మాతాశిశు సేవలు, ఎన్‌బీఎస్‌యూ సేవలతో పాటు జేఎస్‌వై, ఎస్ఎస్ఎస్‌కే వినియోగంపై చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎల్.భాస్కర్ నాయక్, డాక్టర్ శివకృష్ణ, సిబ్బంది సతీష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

69 మందికి సదరమ్ సర్టిఫికెట్లు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన సదరమ్ క్యాంపునకు 119 మంది దివ్యాంగులు హాజరయ్యారు. మొత్తం 147 మంది స్లాట్ బుక్ చేసుకోగా ఆర్థోపెడిక్ 59, కంటి 12, మానసిక 41, ఈఎన్‌టీ విభాగంలో ఏడుగురు వచ్చారు. వీరికి ఆయా విభాగాల వైద్యులు వైకల్య పరీక్షలు నిర్వహించి 69 మందిని సదరమ్ సర్టిఫికెట్‌కు అర్హులుగా నిర్ధారించారు.

రాజీపడదగిన క్రిమినల్ కేసుల పరిష్కారం

ఖమ్మంలీగల్: వచ్చేనెల 11న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులను ఎక్కువ సంఖ్యలో పరిష్కరించడం ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఏ.జావీద్‌పాషా సూచించారు. ముందస్తు లోక్ అదాలత్‌లో భాగంగా మంగళవారం ఆయన కోర్టు కానిస్టేబుళ్లతో సమావేశమయ్యారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కక్షిదారులను న్యాయవాదుల ద్వారా లోక్‌అదాలత్ ముందు హాజరుపరిస్తే సత్వర న్యాయం అందుతుందని తెలిపారు. పోలీస్ లైజన్ అధికారి వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా 'కంటి వెలుగు'

ఇప్పటివరకు 30,233 మందికి స్క్రీనింగ్

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. ఈనెల 18న సీఎం కేసీఆర్‌తో పాటు ముగ్గురు ముఖ్యమంత్రులు జిల్లాలో కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఆ మరుసటి రోజు నుంచి జిల్లాలో కంటి వెలుగు పరీక్షలు మొదలయ్యాయి. శని, ఆదివారాలు సెలవులు కాగా, ఇప్పటివరకు నాలుగు రోజుల పాటు సాగిన కార్యక్రమంలో 30,233 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 64బృందాల ద్వారా 200 వరకు శిబిరాల్లో పరీక్షలు నిర్వహించగా, 9,284 మందికి రీడింగ్ గ్లాసులు అవసరమని గుర్తించి9,152 మందికి అందజేశారు. అలాగే, సమస్య తీవ్రంగా ఉన్న 5,971 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసులు ఇవ్వాలని నిర్ణయించామని డీఎంహెచ్ఓ మాలతి తెలిపారు.

క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎంపీ రవిచంద్ర



ఎంపీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతున్న సీఎం

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాద్ ప్రగతిభవన్‌లో మంగళవారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ఈసందర్భంగా వారు ఎంపీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, కేబీఆర్ పార్కులో గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మొక్క నాటాక ఖమ్మం వచ్చిన రవిచంద్రకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే సండ్ర



సచివాలయం వద్ద సీఎంతో ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: హైదరాబాద్ ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా సీఎంతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. సెక్రటరియేట్ అత్యంత అధునాతనంగా, అద్భుతంగా సిద్ధమవుతుందని ఎమ్మెల్యే ఓ ప్రకటనలో వెల్లడించారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కామేపల్లి(కారేపల్లి): రాజస్థాన్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన 18వ జాతీయ స్థాయి స్కౌట్, గైడ్స్ జంబోరీలో ముచ్చర్ల-జాస్తిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వరికొల్లు రాము, జిందం దుర్గేష్ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. స్కౌట్ మాస్టర్ రఘుకుమార్, ఉపాధ్యాయులు పెసర ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుల్లయ్య బంజరలో గడ్డివాము దగ్ధం



మంటలు ఆర్పుతున్న రైతులు

కల్లూరు రూరల్: మండలంలోని పుల్లయ్య బంజరులో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని గడ్డివాము దగ్ధమైంది. గ్రామంలోని రైతు బుర్రి రామకృష్ణ మంగళవారం తన ఇంటి పక్కన గేదెలు కట్టేసి దోమలు కుట్టకుండా పొగ పెట్టాడు. ఈక్రమంలో నిప్పురవ్వలు ఎగిసిపడి గడ్డి వాముపై పడడంతో మంటలు అంటుకున్నాయి. సత్తుపల్లిలోని అగ్నిమాపక కేంద్రం నుంచి ఫైర్ ఇంజన్ వచ్చేలోగా రూ.50వేల విలువైన గడ్డి దగ్ధమైందని రైతు వాపోయాడు.

అదుపు తప్పి కూలీల ఆటో బోల్తా

నేలకొండపల్లి: కూలీలతో వెళ్తున్న ఆటో అదుపు తప్పి పల్టీ కొట్టగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని జెర్రిపోతులగూడెంకు చెందిన వ్యవసాయ కూలీలు మంగళవారం నాట్లు వేసేందుకు మండలంలోని అనాసాగారం వచ్చారు. నాట్లు వేశాక తిరిగి వెళ్తుండగా వీరి ఆటో కొత్తకొత్తూరు సమీపాన అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఆర్.నాగమణి, టి.మణెమ్మకు తీవ్ర గాయాలు, మిగిలిన వారికి స్వల్ప గాయాలు కావడంతో నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,150	7,100
కందులు	6,650	6,000
మిర్చి కొత్తవి	19,500	12,000
నిల్వమిర్చి	18,800	18,800
మిర్చి తాలు	10,000	7,500
పత్తి	7,900	5,800

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.13,881

ఓటు.. వజ్రాయుధం!

- జిల్లా ఓటర్లు 11,53,987
- అత్యధికంగా ఖమ్మం, అత్యల్పంగా వైరా
- ప్రతీ నియోజకవర్గంలోనూ మహిళలే అధికం

నేడు జాతీయ ఓటరు దినోత్సవం



ఖమ్మంసహకారనగర్: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం... ఎన్నిక ఏదైనా ప్రజలు ఇచ్చే తీర్పే కీలకం. ఉత్తమమైన నాయకులను ఎన్నుకోవాలన్నా, అక్రమార్కులు, అవినీతిపరులను గద్దె దించాలన్నా ఓటు ప్రజల చేతిలో ఉన్న అస్త్రం! అందుకే ఓటు హక్కును అందరు బాధ్యతగా.. ప్రతీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడాన్ని కర్తవ్యంగా భావించాలి. నేడు(బుధవారం) జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఓటర్ల వివరాలు, ఓటరు దినోత్సవం ప్రాధాన్యతపై కథనం.

నిర్భయంగా ఓటు హక్కు

భారత ఎన్నికల సంఘం దేశంలోని అర్హులైన పౌరులందరూ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తోంది.. అంతేకాక ఓటర్ల భాగస్వామ్యం పెంచేందుకు వారి బాధ్యతలు గుర్తుచేస్తూ కొత్తగా ఓటర్ల నమోదు, జాబితా సవరణ, గుర్తింపు కార్డుల పంపిణీని నిరంతరం చేపడుతోంది. జిల్లాలో ఒక పార్లమెంట్ నియోజకవర్గం, ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో 11,53,987 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 5,62,623, మహిళలు 5,91,290మంది, ఇతరులు 74మంది ఉన్నారు. అత్యధికంగా ఖమ్మం నియోజకవర్గంలో 3,08,403మంది, అత్యల్పంగా వైరా నియోజకవర్గంలో 1,84,840మంది ఓటర్లు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇక జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు 28,667మంది ఎక్కువగా ఉండడం విశేషం.

ఓటరు దినోత్సవం ఇలా...

ప్రజాస్వామ్యంలోని ఎన్నికల ప్రక్రియలో పౌరుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఎన్నికల కమిషన్ ఏటా జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. 2011 నుంచి జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తూ ఓటర్లలో చైతన్యానికి కృషి చేస్తోంది. తొలినాళ్లలో బ్యాలెట్ పేపర్ల ద్వారా ఓటింగ్ జరగగా, ఆ తర్వాత ఈవీఎంలు, ఆపై వీవీ ప్యాట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. తద్వారా ఓటు ఎవరికి వేశారో ఓటరు తెలుసుకునే వీలు కల్పించారు. అంతేకాక ఈవీఎం యంత్రంలో నోటా బటన్‌ను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పోటీ చేసే వారెవరూ నచ్చలేదని చెప్పడం సాధ్యమవుతోంది.

యువతే కీలకం..


జిల్లాలో యువత ఓటర్లే కీలకం కానున్నాయి. 18నుంచి 80ఏళ్ల వారీగా ఓటర్ల వివరాలు లెక్క తీయగా 30–39 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన ఓటర్లే 3,28,612మంది ఉన్నారు. అత్యల్పంగా 18నుంచి 19 ఏళ్ల వయస్సు వారు 20,066మంది ఉన్నారు. ఆ తర్వాత స్థానంలో 20నుంచి 29 ఏళ్ల వారు 2,06,870మంది, 90నుంచి 99 ఏళ్ల వయస్సు వారు 2,965 మంది, 100కుపైబడిన వారు 180మంది ఉన్నారు. తద్వారా భవిష్యత్‌లో జరిగే ఎన్నికల్లో 30–39సంవత్సరాల ఓటర్లు కీలకం కానున్నారు. ఇక పురుషులు, మహిళల వారీగా పరిశీలిస్తే అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళలే ఎక్కువ ఓటర్లు ఉండడంతో మహిళలు ఇచ్చే తీర్పు నేతల భవిష్యత్‌ను నిర్దేశించనుంది.

నేటి కార్యక్రమాలు..

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం అన్ని కళాశాలల్లో ఓటర్ల దినోత్సవంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో మధ్యాహ్నం ఒంటి గంటకు ఓటరు దినోత్సవానికి సంబంధించిన పాట వినిపిస్తారు. అంతేకాక నూతన కలెక్టరేట్‌లో ఎంపిక చేసిన కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులు అందించనున్నారు.

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఖమ్మం	1,48,830	1,59,527	46	3,08,403
పాలేరు	1,08,554	1,14,636	06	2,23,196
మధిర	1,02,241	1,07,698	06	2,09,945
వైరా	90,809	94,024	07	1,84,840
సత్తుపల్లి	1,12,189	1,15,405	09	2,27,603
మొత్తం	5,62,623	5,91,290	74	11,53,987



28 నుంచి 'సాక్షి' ప్రీమియర్ లీగ్



డ్రా తీస్తున్న డీవైఎస్ఓ పరంధామరెడ్డి, పక్కన సాక్షి ఉద్యోగులు

ఖమ్మం స్పోర్ట్స్: 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యాన ఈనెల 28 నుంచి 'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ప్రారంభం కానుంది. వారంపాటు సాగే మ్యాచ్‌లకు సంబంధించి డ్రాను డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి మంగళవారం తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా 'సాక్షి' ఆధ్వర్యన ఔత్సాహిక క్రీడాకారులకు ప్రోత్సహించేందుకు టోర్నీ నిర్వహిస్తుండడం అభినందనీయమని తెలిపారు. అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, సాక్షి బ్రాంచ్ మేనేజర్ గుడిమెట్ల మోహనకృష్ణ, బ్యూరో ఇన్‌చార్జ్ బొల్లం శ్రీనివాస్, టీవీ ప్రతినిధి పి.మహేంద్రకుమార్, డిప్యూటీ మేనేజర్(ఏడీవీటీ) ఎస్.నాగ శేషు, ఈవెంట్ మేనేజర్ బొడపట్ల వేణు, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాధారపు రాజు, ఆర్‌సీ ఇన్‌చార్జ్ నెల్లూరి ఉపేందర్, స్పోర్ట్స్ రిపోర్టర్ జుజ్జూరు ఉపేందర్‌తో పాటు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి ఓలేటి సాంబమూర్తి, సీనియర్ క్రికెటర్లు జోజి చాకో, ఎం.డీ.ఫారుఖ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, జూనియర్స్ విభాగంలో 23, సీనియర్స్ విభాగంలో 26 జట్లు పాల్గొనే టోర్నీ నిర్వహణకు ఇప్పటికే కమిటీలను ఏర్పాటుచేయగా, నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయని నిర్వాహకులు వెల్లడించారు.



● అటు ఉద్యోగులు.. ఇటు సందర్శకులు !



రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో నిర్మించిన నూతన కలెక్టరేట్(ఐడీఓసీ) ఇటీవల ప్రారంభం కాగా.. జిల్లా కేంద్రంలోని నలుమూలల ఉన్న 39శాఖలను ఇక్కడకు తరలించారు. దీంతో అధికారులు, ఉద్యోగులకు తోడు వివిధ పనులపై వచ్చే వారు పార్కింగ్ చేసిన వాహనాలను భవనం పైనుంచి చూస్తే ఇలా కనిపిస్తోంది. జిల్లా స్థాయి అధికారుల కార్లు, ఉద్యోగుల ద్విచక్ర వాహనాలను నిలిపేందుకు త్వరలోనే పార్కింగ్ షెడ్ నిర్మించనున్నట్లు సమాచారం. మరోపక్క ఐడీఓసీకి వచ్చివెళ్లే ప్రతీఒక్కరి కదలికలను రికార్డు చేసేలా ఆవరణలో అత్యాధునిక కెమెరాలను బిగించారు. రాత్రివేళ కూడా రికార్డ్ చేయగలిగే సామర్థ్యం కలిగిన కెమెరాలు ఉండడంతో ఏదైనా ఘటన జరిగినప్పుడు గుర్తించడం సులవవుతుందని చెబుతున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అవసరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు
- రెజొనెన్స్ శ్రీనగర్‌లో అవగాహన సదస్సు





విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు, పక్కన సీనియర్ సివిల్ జడ్జి జావీద్‌పాషా, డైరెక్టర్ శ్రీధర్‌రావు తదితరులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

ఖమ్మం సహకారనగర్: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, కష్టపడేతత్వం వంటి విత్తనాలు నాటితే గెలుపు అనే పంట వస్తుందని.. తద్వారా ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని శ్రీనగర్ కాలనీ రెజొనెన్స్ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా జిల్లా జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ మేధావుల జీవితం ఓటమితోనే మొదలైనా, ప్రపంచానికి వెలుగులు నింపే విజయాలను అందుకున్నారన్నారు. పుస్తకాల్లోని జ్ఞానాన్ని పొందుతూనే సామాజిక స్పృహతో మేధావులుగా తీర్చిదిద్దబడాలని తెలిపారు. ప్రతీ విద్యార్థి న్యాయం, నీతి, నిజాయితీగా వ్యవహరిస్తే మెరుగైన సమాజం ఏర్పడుతుందని చెప్పారు. అనంతరం న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా మాట్లాడుతూ స్నేహపూర్వక న్యాయసేవల పథకం ద్వారా బాలబాలికలకు న్యాయసేవాధికార సంస్థలు న్యాయసేవలు అందిస్తున్నాయన్నారు. ఆతర్వాత ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జిల్లా జడ్జి ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేసి అభినందించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడుతూ వివిధ రకాల పోటీ పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచడమే కాక అత్యుత్తమంతా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొండా కృష్ణవేణి, న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసన్నరావు, ఐటీబీ డైరెక్టర్ రామకృష్ణ, జిల్లా ఇన్‌చార్జ్ కావ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలతో ఆర్థికాభివృద్ధి



చెక్కు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

మధిర: బ్యాంకులు ఇచ్చే రుణాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకుని ఆర్థికాకాభివృద్ధి సాధించాలని యూనియన్ బ్యాంక్ ఇండియా అధికారులు శ్రీకళ, పార్థసారథి మురళి సూచించారు. మధిరలోని వెంకటేశ్వర స్వామి ఆలయ కళ్యాణ మండపంలో కోల్డ్ స్టోరేజ్‌ల నిర్వాహకులు, డ్వాక్రా మహిళలు, ఖాతాదారులకు మంగళవారం రుణ మేళా ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గత ఏడాది డ్వాక్రా మహిళలకు బ్యాంకు ద్వారా రూ.15 కోట్ల రుణాలను మంజూరు చేయగా, ఈఏడాది రూ.2 కోట్లు, కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులకు రూ.120 కోట్ల రుణాలను ఇచ్చినట్లు తెలిపారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకుంటూనే సకాలంలో చెల్లించాలని కోరారు. అనంతరం డ్వాక్రా మహిళలకు రుణాల చెక్కులు అందజేశారు. ఈ సమావేశంలో ఏజీఎం వెంకటేశ్వరరావు, బ్రాంచ్ మేనేజర్ రవికుమార్, ఉద్యోగులు మీరా, బివాజీ, వినోద్, ముఖేష్, తేజ, రాజశేఖర్, గోపికృష్ణ పాల్గొన్నారు.

'హాత్ సే హాత్' ఇన్‌చార్జ్‌ల నియామకం

ఖమ్మం సహకారనగర్: కాంగ్రెస్ ఆధ్వర్యాన త్వరలో హాత్ సే హాత్ జోడో అభియాన్ పేరిట యాత్రలు చేపట్టనున్నారు. ఈమేరకు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌లను టీపీసీసీ నియమించింది. ఇందులో భాగంగా ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గానికి వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి, సీనియర్ ఉపాధ్యక్షుడు సురేష్ సెట్కర్, ఒబేదుల్లా కొత్వాల్‌ను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు ఏ.రేవంత్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రచయితలకు మెళకువలు అవసరం

ఖమ్మంగాంధీచౌక్: కథా రచయితలకు మెళుకువలు అవసరమని బాలసాహితీ వేదిక జిల్లా కన్వీనర్ కొండ్రు బ్రహ్మం తెలిపారు. ఖమ్మంలోని ఎన్నెస్పీ ప్రభుత్వ పాఠశాలలో బాల సాహిత్య వేదిక ఆధ్వర్యాన ఒక రోజు 'కథా కార్యశాల' కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వేదిక కన్వీనర్ బ్రహ్మం మాట్లాడుతూ కథలు రాయడం, అంశాన్ని ఎంచుకోవడమే కాక, శీర్షిక, ఎత్తుగడలు, ముగింపుపై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం శంకర్‌రావు మాట్లాడుతూ బాల సాహిత్యంలో విశేష కృషి చేసిన బాల సాహితీవేత్తలు పొత్తూరు సీతారామారావు, పురిమళ్ల సునంద, కన్నెగంటి వెంకటయ్య, సుచరిత, శ్రీనివాస్ సేవలు ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ సుజాత, రామకృష్ణ, ఉష, నజీరా పాల్గొన్నారు.

కొత్తగూడెం ఏరియాలో ఉత్తమ కార్మికులు వీరే..

సింగరేణి(కొత్తగూడెం): గణతంత్ర దినోత్సవం సందర్భంగా 10 మంది ఉత్తమ కార్మికులను మంగళవారం ఏరియా అధికారులు ఎంపిక చేశారు. వారిలో ఉత్తమ సింగరేణియన్‌ను కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా సన్మానించనుండగా మిగిలిన వారిని మాత్రం ఏరియాలో జరిగే గణతంత్ర దినోత్సవాల్లో ఏరియా జీఎం జక్కం రమేశ్ సన్మానించనున్నారు.

ఎంపికైన వారి వివరాలు

- ఉత్తమ సింగరేణియన్‌గా జె.శ్రీరామ్మూర్తి (ఈపీ ఎలక్ట్రీషన్ జేవీఆర్‌ఓసీ-2).
- ఉత్తమ అధికారిగా వి.వేమారెడ్డి (సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ జేవీఆర్‌ఓసీ-2)

ఉత్తమ కార్మికులు..

- బోడా సక్రు (సపోర్ట్‌మెన్, పద్మావతి ఖని).
- కె.రత్నభూషణ్ (జనరల్ మజ్దూర్, పద్మావతి ఖని).
- ఎం.శ్రీనివాసరావు (ఈపీ ఫిటర్ కం మెకానిక్, జీకేఓసీ).
- షేక్ యాకోబ్‌సాబ్ (డ్రిల్ ఆపరేటర్, జీకేఓసీ)
- మహమ్మద్ ఆసిఫ్ (హెడ్ ఓవర్‌మెన్ కిష్టారం
- మేడేపల్లి శ్రీనివాస్ (జనరల్ మజ్దూర్ కిష్టారం ఓసీ).
- రామంచి రాజయ్య (జనరల్ మజ్దూర్ జేవీఆర్ ఓసీ).
- అమర్ రషీద్ (ఈపీ ఆపరేటర్ జేవీఆర్ ఓసీ).

బస్సులో నుంచి దూకి ఒడిశా వాసి ఆత్మహత్య



సోదు మదిలై మృతదేహం

పాల్వంచరూరల్: వేగంగా వెళ్తున్న బస్సులో నుంచి దూకి ఒడిశా రాష్ట్రానికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగారంకాలనీ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నాగారంకాలనీ వద్ద బీసీయం రహదారిపై హైదరాబాద్ నుంచి ఒడిశా రాష్ట్రంలోని మలన్‌గిరికి వెళ్తున్న స్లీపర్‌కోచ్ బస్సు కిటికిలో నుంచి మంగళవారం తెల్లవారుజామున సోదు మదిలై(20) ఒక్కసారిగా కిందకు దూకాడు. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడు హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. కొద్దిరోజులుగా అతడి మానసిక స్థితి బాగా లేదని, అతడి సోదరుడితో తరచూ చనిపోతానని చెబుతుండేవాడని పోలీసులు తెలిపారు. దీంతో సోదు మదిలై సోదరుడి మిత్రుడు సంజయ్‌గోలేరి అతడిని హైదరాబాద్ నుంచి ఇంటికి తీసుకెళ్తున్న క్రమంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలాన్ని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ సందర్శించారు. మృతదేహాన్ని పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి సోదరుడు మంగరాజ్ మదిలై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీఆర్ఎస్ నాయకులు దాడి చేశారని ఫిర్యాదు

ఖమ్మంఅర్బన్: నగరంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు తనపై దాడి చేసి గాయపర్చగా ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆటోడ్రైవర్ తేలూరి రామకృష్ణ వెల్లడించారు. రెండు రోజుల క్రితం ఓ యూట్యూబ్ చానల్ వారు కాలనీకి వచ్చి రానున్న ఎన్నికల్లో పొంగులేటి శ్రీనివాసరెడ్డి గెలుస్తాడా అని అడిగితే తాను గెలుస్తాడని చెప్పానని పేర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ నాయకులు మంగళవారం తనపై దాడి చేశారని రామకృష్ణ ఆరోపించారు. కాగా, ఈ విషయమై ఖమ్మం అర్బన్ సీఐ రామకృష్ణను వివరణ కోరగా.. తమకు ఇంత వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కల్లూరు: మండలంలోని చిన్నకోరుకొండి పంచాయతీ పరిధి దారుగాబంజర్ మీదుగా ఏపీకి అక్రమంగా తరలుతున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కల్లూరు నుంచి ఏపీకి టాటా ఏస్‌లో బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఎస్సై కొండల్‌రావు స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయీస్ డీటీ సత్యనారాయణకు అప్పగించారు. అలాగే, డ్రైవర్ జానీపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: నగరంలోని రామన్నపేటకు చెందిన 19 ఏళ్ల యువతి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఆమె తండ్రి ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం ఇంటి నుండి వెళ్లిన యువతి రాలేదని తిరిగి రాకపోవడంతో, తిరుమలాయపాలెం మండలం రామచంద్రాపురానికి చెందిన శంకర్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని శ్రీనగర్‌కాలనీలో హాస్టల్ ఎదుట పార్కింగ్ చేసిన బుల్లెట్ బైక్ చోరీ అయింది. రామగుండంకు చెందిన రాజశేఖర్‌రెడ్డి ఖమ్మంలోని బాయిస్స్ హాస్టల్‌లో ఉంటూ కోచింగ్ తీసుకుంటున్నాడు. రోజుమాదిరిగానే ఈనెల 15న తన వాహనాన్ని పార్కింగ్ చేసి మరుసటిరోజు చూసే సరికి లేదు. దీంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆయన చేసిన ఫిర్యాదుమేరకు మంగళవారం కేసు నమోదు చేశామని ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

చిట్‌ఫండ్ కార్యాలయానికి తాళాలు

పాల్వంచ: పాల్వంచలోని ఓ చిట్ ఫండ్‌లో చిట్టిపాట పాడుకున్నా సకాలంలో డబ్బులు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారంటూ బాధితులు మంగళవారం ఆందోళనకు దిగారు. నటరాజ్‌సెంటర్‌లోని చిట్ ఫండ్ కార్యాలయం వద్దకు కొందరు బాధితులు చేరుకుని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అనంతరం కార్యాలయానికి తాళాలు వేశారు. చిట్స్ వేస్తే రకరకాల ఆఫర్లు ఉన్నాయంటూ నమ్మబలికారని, చిట్టీ పాడి నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తుండటంతో తాము ఇబ్బందులు పడుతున్నామని, తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన చేస్తామని, తాళాలు కూడా తీయనీయమని హెచ్చరించారు.

వచ్చే నెల 22 నుంచి పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఐ ఈడీ) మొదటి సంవత్సరం పరీక్షలు వచ్చేనెల 22 నుంచి జరగనున్నాయి. వచ్చేనెల 22 నుంచి 28వ తేదీ వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు.